క్లుప్తంగా

పక్కాగా హద్దురాళ్ల ఏర్పాటు

రేగిడి: మండలంలోని సరసనాపల్లి గ్రామంలో భూముల రీసర్వే పూర్తయిన ప్రాంతాల్లో హద్దురాళ్ల ఏర్పాటు పక్కాగా చేపడుతున్నారు. తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి ఆ పనులను శనివారం పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతుల సమక్షంలోనే రీసర్వే, హద్దురాళ్ల ఏర్పాటు వంటివి చేపట్టాలని, అలా అయితే వారి మధ్య ఎప్పటికీ తగాదాలు తలెత్తవన్నారు. అనంతరం జోడుబందల గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వేను పరిశీలించిన ఆయన సర్వే జరుగుతున్న సమయంలో రైతులు అందుబాటులో ఉండాలని కోరారు. ఉప్పర్నాయుడువలస, అక్కన్నఅగ్రహారం, గోపింపేట, కొర్లవలస తదితర గ్రామాల్లో భూసర్వే పూర్తయిందన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

రాజాం: గ్రామీణ ప్రాంతాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు సూచించారు. మండలంలోని నందబలగ గ్రామంలో కొత్త ఫాగింగ్ యంత్రాన్ని శనివారం ప్రారంభించి, ఫాగింగ్ చర్యలు చేపట్టించారు. వర్షాకాలం కావడంతో దోమలు ఉత్పత్తి అధికంగా ఉంటుందని, వాటి బారినపడి జ్వరాలపాలు కాకుండా దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొర్ను ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

550 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు



లక్ష్మీపురంలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

రేగిడి: మండలంలోని 550 ఎకరాల్లోని పంటలకు సంబంధించి, ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ శనివారం తెలిపారు. ప్రతీ రైతు తమ పంటకు సంబంధించి, ఈ-క్రాప్ నమోదు చేయించడం ద్వారా పంటల విక్రయాలతో పాటు బీమా పొందడం సులభతరమవుతుందన్నారు. 1-బి అడంగల్ ఆధారంగా ఈ-క్రాప్ నమోదు చేయడం జరుగుతుందన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

వంగర: రైతులు పంట పొలాల్లో పురుగుమందులు పిచికారీ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని లేకపోతే ప్రాణాపాయం ఉంటుందని మండల వ్యవసాయాధికారి తట్టికోట కన్నబాబు హెచ్చరించారు. మండలంలోని మద్దువలస, జగన్నాధవలస గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆయన రైతులతో సమావేశమై, పంటపై పురుగుమందు పిచికారీ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పిచికారీ చేసే సమయంలో నోటికి మాస్క్, కళ్లకు రక్షణగా కళ్లద్దాలు పెట్టుకోవాలని తెలిపారు. అనంతరం చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించుకోవాలి



రొంపల్లిలో గ్రామపెద్దలతో సమావేశమైన సీఐ తిరుమలరావు

రామభద్రపురం: ప్రశాంతంగా వార్డు మెంబర్ల ఉపఎన్నికలు నిర్వహించుకోవాలని సీఐ తిరుమలరావు సూచించారు. ఈ నెల 19వ తేదీన మండలంలోని రొంపల్లి గ్రామంలో 7వ వార్డు మెంబరు ఉపఎన్నిక జరగనున్న నేపథ్యంలో ఎస్ఐ సురేంద్రనాయుడుతో కలిసి శనివారం ఆ గ్రామం వెళ్లి, గ్రామపెద్దలతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.శంకరరావు, వైఎస్సార్ సీపీ నేత పి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సంకిలి పీఏసీఎస్ చైర్మన్‌కు సత్కారం



సంకిలి పీఏసీఎస్ చైర్మన్‌ను సత్కరిస్తున్న అంబఖండి గ్రామస్తులు

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో సంకిలి పీఏసీఎస్ చైర్మన్‌గా ఎంపికైన లావేటి వెంకటవేణుగోపాలనాయుడును అంబఖండి గ్రామస్తులు శనివారం ఘనంగా సత్కరించారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తికి చైర్మన్ పదవి ఇచ్చినందుకు గాను రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లకు ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు లావేటి గణపతిరావునాయుడు, లావేటి హరిబాబు, గులివిందల సాంభమూర్తి, పీఏసీఎస్ డైరెక్టర్లు కొమ్ము దుర్గారావు, పేడ్డ రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ అజెండా

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ప్రధాన అజెండా అని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. శనివారం మండలంలోని గురవాం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పరశురాముడిపేటలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఓ వైపు ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా పారదర్శకంగా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందిస్తూనే మరోవైపు ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో రూ.20 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేయిస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు మేలు జరిగేలా ఆయన అందిస్తున్న పథకాలతో అందరూ సంతోషంగా ఉన్నారన్నారు. ఇప్పటివరకు ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా జన్మభూమి కమిటీల ప్రమేయం లేనిదే జరిగేవి కావన్నారు. గత పాలనకు ఇప్పటి పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. ప్రభుత్వాన్ని ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే లేనిపోని ఆరోపణలతో ప్రతిపక్షాలు తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. అధికారానికి ఐదేళ్లు దూరమైన టీడీపీ నేతలు మళ్లీ అధికారం కోసం దిగజారుడు రాజకీయాలకు సిద్ధమయ్యారని ధ్వజమెత్తారు. ప్రజలంతా బాగుండాలని నిత్యం తపన పడుతున్న మన సీఎం జగనన్నను వచ్చే ఎన్నికల్లోనూ గెలిపించి, ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ లావేటి సులోచన, వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, జేసీఎస్ కన్వీనర్ కామోదులు శ్రీనివాసరావు, సర్పంచ్ బి.రమణమ్మ, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, తహసీల్దార్ ఎస్.కె.రాజు, పంచాయతీ కార్యదర్శి అజయ్, వీఆర్ఓ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం



తెర్లాం: ఎస్.ఆర్ రంగనాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, లైబ్రేరియన్ కృష్ణమూర్తి



బాడంగి: లైబ్రేరియన్ దుర్గాప్రసాద్‌ను సన్మానిస్తున్న స్థానికులు

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ దినోత్సవం, గ్రంథాలయోద్యమంలోని ప్రముఖుల్లో ఒకరైన ఎస్.ఆర్.రంగనాథన్ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, పాఠకులు కలిసి రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘననివాళులర్పించారు. క్యాటలాగ్ సిస్టమ్‌ను లైబ్రరీకి అందించిన ఘనత ఆయనదేనని, ఆయన పుట్టిన రోజునాడే జాతీయ గ్రంథాలయ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని వక్తలు అన్నారు. అనంతరం లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పిండ్రంగివలస ప్రధానోపాధ్యాయుడు రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.ఆర్.రంగనాథన్‌కు ఘననివాళి..

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ దినోత్సవం, గ్రంథాలయోద్యమ ప్రముఖుడు ఎస్.ఆర్ రంగనాథన్ జయంత్యుత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఎందరో జీవితాల్లో వెలుగులు నింపిన ఓ పుస్తక భాండాగారంగా పిలువబడే గ్రంథాలయాలను స్థాపించిన మహోన్నతమైన వ్యక్తి రంగనాథన్ అని కొనియాడారు. గ్రంథాలయాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు.

శరవేగంగా విద్యుదీకరణ పనులు



ఎం.బూర్జివలసలో జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు

బొబ్బిలి: స్థానిక పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఓ వైపు ఇళ్ల నిర్మాణాలు మరోవైపు కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తుండడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమావేశమైన గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. నిర్మాణాలను వేగవంతం చేయడంతో పాటు కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. అప్రమత్తమైన మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఆయా పనుల వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నారు.

ఐక్యతతోనే దేవాంగుల అభివృద్ధి



మాట్లాడుతున్న దేవాంగ సంక్షేమ సంఘం నేతలు

రాజాం: అందరూ ఐక్యంగా ఉంటూ, ఒకరి కష్టసుఖాల్లో మరొకరు పాలుపంచుకోవడం ద్వారానే మనం అభివృద్ధి సాధించగలమని దేవాంగ సంక్షేమ సంఘ రాష్ట్ర నాయకులు నిమ్మల కిష్టప్ప, బీరక ప్రసాద్ అన్నారు. స్థానిక పట్టణంలోని సూర్యదుర్గా కల్యాణ మండపం వద్ద దేవాంగ సోదరుల ఆత్మీయ కలయిక కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాంగ కుటుంబానికి చెందిన ప్రతీ విద్యార్థి ఉన్నత చదువులు చదవాలని, ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు ఉన్నత చదువులు ఒక్కటే మార్గమన్నారు. అన్ని ప్రాంతాల్లో సంఘాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో విశాఖ దేవాంగ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు ఉప్పు సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ సర్వేను వేగవంతం చేయండి



ఓటర్ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఐజాక్

వంగర: గ్రామాల్లో ఓటర్ సర్వేను వేగవంతం చేయండి అని తహసీల్దార్ డి.ఐజాక్ ఆదేశించారు. మండలంలోని మగ్గూరు, ఓనె అగ్రహారం, సంగాం గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆయన బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి, చేస్తున్న ఓటర్ సర్వేను పరిశీలించారు. జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు ఓటర్లుగా జాబితాలో చేర్పించాలని, ఓటర్లలో మృతులుంటే వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు.

బదిలీ ప్రధానోపాధ్యాయునికి సన్మానం



ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తెర్లాం: మండలంలోని వెలగవలస హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి, బదిలీపై వెళ్లిన ఆర్.సత్యనారాయణరావుతో పాటు తెలుగు ఉపాధ్యాయుడు సాకేటి గణపతిరావును తోటి సిబ్బంది శనివారం సన్మానించారు. హెచ్ఎం మాట్లాడుతూ తాను హెచ్ఎంగా పనిచేసిన కాలంలో పాఠశాల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి కృషి చేయడానికి తనకు సహకరించిన స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్, సభ్యులకు కృతజ్ఞతలన్నారు.

మారణకాండకు నిరసనగా ఐక్యర్యాలీ



అంబేడ్కర్ కూడలిలో మానవహారంగా ఏర్పడి, నినాదాలు చేస్తున్న ముస్లింలు, క్రైస్తవులు

రాజాం సిటీ: మణిపూర్, హర్యానా, గుజరాత్ రాష్ట్రాల్లో మైనార్టీలపై జరుగుతున్న మారణకాండకు నిరసనగా స్థానిక పట్టణంలో ముస్లింలు, క్రైస్తవులు కలిసి ఐక్య ర్యాలీ చేపట్టారు. అల్లర్లకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం అంబేడ్కర్ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి, ప్రధాని మోదీ గద్దె దిగాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ఆయా రాష్ట్రాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని డిమాండ్ చేశారు.

ప్రపంచీకరణపై అవగాహన ఉండాలి

బొబ్బిలి: ప్రపంచీకరణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విద్యాలయం బొబ్బిలి ఇన్‌చార్జ్ బి.కె.రాజేశ్వరి అన్నారు. స్థానిక గాయత్రి డిగ్రీ కాలేజీలో ప్రపంచీకరణపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ప్రతీ విద్యార్థి ఆత్మగౌరవం కలిగి ఉండాలని, మానసిక ఒత్తిడిని జయించాలన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన



దోలపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ దుర్గారావు

రాజాం: మండలంలోని డోలపేట, కంచరాం, గడిముడిదాం తదితర గ్రామాల్లో చేపడుతున్న మనబడి నాడు-నేడు పనులను ఎంఈఓ యాగాటి దుర్గారావు శనివారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాల మేర పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దన్నారు.

17న బస్సుయాత్ర

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని ఎన్‌జీవో హోమ్‌లో సీపీఐ నేత కండాపు ప్రసాదరావు ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధిపై చర్చావేదిక శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ నెల 17వ తేదీన నిర్వహించే బస్సుయాత్రకు అందరూ తరలిరావాలని ఆయన కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అప్పారావు, పీకేఎస్ జిల్లా అధ్యక్షుడు టి.అప్పలనాయుడు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

14న హుండీల ఆదాయం లెక్కింపు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ హుండీల కానుకల లెక్కింపు ఈ నెల 14వ తేదీన చేపట్టనున్నామని ఈఓ బీవీ మాధవరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది, భక్తులు పాల్గొనాలని కోరారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దివ్య కుటుంబీకులు

రాజాం: స్థానిక పట్టణ పరిధిలోని సారధి రోడ్డు సమీపంలో ఉన్న బధిరుల పాఠశాలలోని విద్యార్థులకు దుప్పట్లు శనివారం పంపిణీ చేశారు. తెర్లాం మండలంలోని బూరిపేట గ్రామానికి చెందిన డి.దివ్య వర్ధంతి సందర్భంగా ఆమె కుటుంబీకులు వీటిని వితరణ చేశారు. కార్యక్రమంలో మధుసూదనరావు, గణేష్, మొగిలివలస వైఎస్సార్ సీపీ నేత హరనాధరావు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగు బాగు



రాజాం మండలంలోని పాగిరిలో ఏపుగా పెరిగిన మొక్కజొన్న పంట



రేగిడి మండలంలోని కొమెర వద్ద విస్తారంగా చెరకు సాగు

రాజాం: నియోజకవర్గ వ్యాప్తంగా ఖరీఫ్ సాగు బాగుంది. రాజాం మండలంతో పాటు రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో వరి, మొక్కజొన్న, చెరకు పంటలను విస్తారంగా సాగు చేస్తున్నారు. రాజాం నియోజకవర్గంలో దాదాపు 40 వేల ఎకరాల్లో ప్రస్తుతం వరి ఉభాలు జరగగా, 8 వేల ఎకరాల్లో ఇప్పటివరకు మొక్కజొన్న సాగును రైతులు చేపట్టారు. రేగిడి, సంతకవిటి మండలాల్లోని 6 వేల ఎకరాల్లో చెరకు పంట పండిస్తున్నట్లు వ్యవసాయ శాఖ రాజాం ఏడీఏ కె. చంద్రరావు తెలిపారు. ప్రభుత్వం సకాలంలో రైతులకు విత్తనాలు, ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తుండడంతో అన్నదాతలు సాగుపై ఆసక్తి చూపిస్తున్నారన్నారు.

నా భూమి-నా దేశం అందరి కార్యక్రమం



రాజాం: మొక్కలు నాటే కార్యక్రమంను ప్రారంభిస్తున్న ఎంపీపీ సులోచన తదితరులు

- ఎంపీపీ లావేటి సులోచన



బొబ్బిలిలో మొక్కలు నాటుతున్న గ్రీన్‌బెల్ట్ సొసైటీ సభ్యులు



రేగిడి: తాటిపాడులో మొక్కలు నాటుతున్న గ్రామస్తులు

రాజాం: నా భూమి-నా దేశం కార్యక్రమం అందరి కార్యక్రమమని ఎంపీపీ లావేటి సులోచన అన్నారు. శనివారం మండలంలోని గడిముడిదాం గ్రామంలో ఈ కార్యక్రమానికి సంబంధించి, శిలాఫలకం ఆవిష్కరించి, మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా మొత్తం 75 మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాసూరి శంకరరావు, సర్పంచ్ లావేటి రమాదేవి, వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, ఏపీఓ సాయిరాం, పంచాయతీ కార్యదర్శి ఎస్.కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఏపీఓ హరనాథరావు అన్నారు. మండలంలోని తాటిపాడు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం శనివారం చేపట్టారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.బాబూరావునాయుడు, పంచాయతీ కార్యదర్శి చిన్నారావు, టీఏ రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ చోడవరపు లక్ష్మీనారాయణ, సొసైటీ మెంబర్ రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ సమతుల్యత..

బొబ్బిలి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ సమతుల్యత అని, ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, పరిరక్షించాలని వక్తలు కోరారు. స్థానిక పట్టణంలోని స్వామి వారి వీధిలోని వేంకటేశ్వరాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం శనివారం చేపట్టారు. గ్రీన్‌బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ ఎస్వీ రమణమూర్తి, సత్యసాయి సమితి కన్వీనర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



వంగర: వంగరలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

బొబ్బిలి: క్రీడలు ఆడడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉద్యోగుల మధ్య క్రీడాపోటీలు శనివారం నిర్వహించారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించగా, విజేతలకు స్వాతంత్య్ర దినోత్సవం నాడు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

వంగర: స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని, మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడాపోటీలు జరుగుతున్నాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్, హైజంప్, లాంగ్‌జంప్ తదితర పోటీల్లో విద్యార్థులు పాల్గొని, తమ సత్తా చాటుతున్నారు.

గంజాయితో పట్టుబడితే కఠిన చర్యలు



బూరాడ జంక్షన్‌లో వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఈబీ సిబ్బంది



రాజాం సిటీ: ఆటోలో తనిఖీలు చేస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

రేగిడి: గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలతో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని రేగిడి ఎస్ఈబీ సీఐ డి.శ్రీధర్ హెచ్చరించారు. మండలంలోని బూరాడ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు శనివారం చేపట్టారు. ఇటీవల ఇదే మండలంలోని పారంపేటకు చెందిన ఓ విద్యార్థి గంజాయి తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడడంతో అన్ని ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గంజాయి రవాణా చేసినా, విక్రయాలు చేసినా, కొనుగోలు చేసినా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్ఐ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: రాజాం మండలంతో పాటు రేగిడి మండలంలోని పలు కూడళ్లలో ఎస్ఈబీ అధికారులు శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. గంజాయి, నాటుసారాతో పాటు నిషేధిత మత్తు పదార్థాల రవాణా జరగకుండా చేపడుతున్న చర్యల్లో భాగంగానే ఈ తనిఖీలు చేపడుతున్నామని ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్ తెలిపారు. ప్రతిరోజూ ఈ తనిఖీలు ఉంటాయన్నారు. నిషేధిత మత్తు పదార్థాలతో పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.పిచ్చేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

'వైఎస్సార్ సంపూర్ణ పోషణ'తో ఆరోగ్యం మెరుగు



పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సులోచన

రాజాం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహార కిట్లతో ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎంపీపీ లావేటి సులోచన అన్నారు. శనివారం మండలంలోని గడిముడిదాం గ్రామ సచివాలయం వద్ద గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేసిన ఆమె వీటిని క్రమం తప్పకుండా వినియోగించి, ఆరోగ్యం కాపాడుకోవాలని తద్వారా బిడ్డ ఆరోగ్యం కూడా బాగుంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ కన్వీనర్ ఎల్.రాజగోపాలనాయుడు, సర్పంచ్ ఎల్.రమాదేవి, ఎంపీడీఓ బి.శంకరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, ఈశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి ఎస్.కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.